# పరివర్తన

-సోమవఝుల నాగేంద్రప్రసాద్

"నమస్కారం రాఘవరావుగారూ" అంటూ పై ఆఫీసర్ అయిన సుధీర్ రావడంతో గౌరవంగా నుంచుని ప్రతి నమస్కారం చేసాడు రాఘవరావు.

"రాఘవరావుగారూ...ఒక్కసారి నా ఛాంబర్‌కి రండి" అంటూ తన ఛాంబర్‌వైపు నడిచాడు సుధీర్. రాఘవరావు, సుధీర్ వెనకాలే నడిచాడు.

"కూర్చోండి రాఘవరావుగారూ..." అంటూ ఎంతో అభిమానంగా ఆయనకు సీటు చూపించి తాను కూడా కూర్చున్నాడు సుధీర్.

"ఇప్పుడు చెప్పండి రాఘవరావుగారూ...ఈ రోజే మీరు రిటైర్ అవుతున్నారు కదా. మరి మీ రిటైర్డ్ లైఫ్‌ని ఎలా గడుపుదామనుకుంటున్నారు?" ఎంతో ఆత్మీయంగా ఆయనను అడిగాడు సుధీర్.

నిజం చెప్పాలంటే సుధీర్ ఆ ఆఫీసుకి వచ్చిన దగ్గర నుండి రాఘవరావుని ఒక ఉద్యోగిలా కాకుండా ఒక ఆత్మీయుడుగా చూడసాగాడు. కారణం... ఆయన తాలూకు మంచితనం, వ్యవహారదక్షత, పనిపట్ల ఆయనకున్న శ్రద్ధ. అందువల్లనే తన పని సులువయ్యేది సుధీర్‌కి. దానివల్ల పై అధికార్ల దగ్గర అతనికి, అతనివల్ల బ్రాంచికి మంచి పేరొచ్చింది. తనకి ఈ పేరు రావడానికి కారణం రాఘవరావుగారి సిన్సియారిటీ, ఎఫీషియన్సీ అని తెలిసిన సుధీర్, రాఘవరావుని మిగతా స్టాఫ్‌కన్నా కొంచెం ఎక్కువ అభిమానంగా చూసేవాడు.

సుధీర్ అంత ఆప్యాయంగా పలకరించడంతో రాఘవరావుకి నోట మాట రాలేదు. అతని కంఠం బొంగురుపోయింది. అది ఆ రోజు ఆయన రిటైర్ అయిపోతున్న కారణంవలన కూడా కావచ్చును.

"ఏంలేదు సార్... రిటైర్ అయిన తరవాత నాకు ఇక్కడ పిత్రార్జితమైన ఒక ఇల్లు వుంది. దానిని అమ్మేసుకుని నా కొడుకు దగ్గరకు వెళ్లిపోతాను సార్. వాళ్ళు కూడా మమ్మల్ని వాళ్ల దగ్గరకు వచ్చేయమని ఎప్పటినుండో చెబుతున్నారు. ఇంతవరకూ ఈ ఉద్యోగం, రిటైర్‌మెంట్ వంకతో వెళ్లలేదు. ఇప్పుడింక తప్పదు సార్" అంటూ తన మనసులోని నిర్ణయాన్ని చెప్పారు రాఘవరావుగారు.

★★★

రాఘవరావుగారికి ఇద్దరే సంతానం. పెద్దమ్మాయి నిర్మల, చిన్నవాడు రవీంద్ర. పెద్దమ్మాయికి తన స్థితికి మించిన సంబంధం చూసి నాలుగేళ్ల క్రితమే పెళ్లి చేసారు. వాళ్ళు ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నారు. ఇంక చిన్నవాడైన రవీంద్ర వివాహం రెండు సంవత్సరాల క్రితమే చేసి తమ బాధ్యతల్ని కొంతవరకు తీర్చుకున్నారు. రవీంద్ర వైజాగ్‌లో ఏదో కంపెనీలో ఆఫీసరుగా పని చేస్తున్నాడు. కోడలు ప్రమీల కూడా అక్కడే వేరే ఏదో కంపెనీలో ఉద్యోగం చేస్తోంది.

వాళ్లకు ఒక ఏడాది వయసున్న బాబు. పేరు రాజేష్. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగం చేస్తుండడంతో మనవడి ఆలనాపాలనా విషయంలో కొంత ఇబ్బంది కలుగుతోంది. కొడుకు కోడలు ఆఫీసుకి వెళ్లేముందు రాజేష్‌ని అక్కడికి దగ్గరలో వున్న క్రెచ్‌లో వదిలేసి ఆఫీసుకి వెళ్లిపోతారు. మరలా వాడిని ఆఫీసు నుండి వచ్చేటప్పుడు తీసుకుని వస్తారు. తమ అత్తమామలు తమ దగ్గరకి వచ్చేస్తే వాడి ఆలనా పాలనా విషయంలో ఇబ్బంది ఉండదని కోడలు ప్రమీల ఆశ.

రవీంద్ర కూడా తల్లిదండ్రుల్ని మీరు మాత్రం ఇక్కడ ఒంటరిగా ఏం ఉంటారు. రిటైర్ అయిన తరువాత మా దగ్గరకు వచ్చేస్తే అంతా కలిసి ఇక్కడే ఉండవచ్చునని చెప్పి వాళ్లని ఒప్పించాడు. అప్పటినుండి రాఘవరావు, ఆయన ధర్మపత్ని అన్నపూర్ణ కూడా ఎప్పుడెప్పుడు తమ కొడుకు దగ్గరకు వెళ్లిపోదామా అని ఎదురు చూస్తున్నారు.

★★★

ఆ రోజు సాయంత్రం రాఘవరావుగారు రిటైర్ అవుతున్న సందర్భంగా ఆఫీసు స్టాఫంతా కలసి చిన్న పార్టీ ఏర్పాటు చేసారు. ఆ పార్టీలో ముందుగా రాఘవరావుగారి జూనియర్ అయిన సదాశివం ఆయన గురించి క్లుప్తంగా మాట్లాడారు. తరువాత సుధీర్ ఆయన గురించి, ఆయనవల్ల తనకు, తన ఆఫీసుకొచ్చిన మంచి పేరు గురించి అందరికీ వివరించి చెప్పాడు. తాను ఎందుకు ఆయనన్ను ప్రత్యేకంగా చూసేవాడో కూడా క్లుప్తంగా చెప్పాడు. ఆయనను ఆదర్శంగా తీసుకుని మీరు కూడా కష్టపడి పనిచేసి మన ఆఫీసుకు ఇంకా మంచి పేరుని తీసుకురావాలని ఈ సందర్భంగా వారిని కోరాడు. ఆ భగవంతుడు ఆయనకు ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని, ఆయన రిటైర్మెంట్ లైఫ్ సాఫీగా సాగాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తూ ఆయనను పూలమాలతో గౌరవించి శాలువాతో సత్కరించి భగవద్గీతను బహూకరించి ప్రేమతో ఆలింగనం చేసుకున్నాడు. అక్కడ ఉన్నవాళ్లంతా కూడా ఎవరో తమ ఆత్మీయుడ్ని కోల్పోతున్నట్లుగా విచార వదనంతో రాఘవరావుగారికి కన్నీళ్లతో వీడ్కోలు చెప్పారు.

రిటైర్ అయిన కొద్దిరోజులకు రాఘవరావుగారు అక్కడ తనకున్న పనులన్నింటినీ చక్కబెట్టుకుని భార్య అన్నపూర్ణతోసహా కొడుకు ఇంట్లో శాశ్వతంగా ఉండేందుకు ఉత్సాహంగా బయలుదేరారు.

★★★

రవీంద్ర దంపతులు వాళ్లని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించారు. వాళ్ల కోసమని ఉన్న రెండు రూముల్లోనే ఒక రూముని కేటాయించారు. చక్కని గాలి, వెలుతురు వస్తుండడంతో రాఘవరావుగారికి ఆ రూము, ఆ వాతావరణం ఎంతగానో నచ్చాయి. అన్నపూర్ణమ్మగారూ ఇల్లంతా తిరిగి చూసింది. ఇల్లు చిన్నదైనా ఉన్నంతలోనే చక్కగా సర్దుకుందని కోడలు ప్రమీలను మనసులోనే మెచ్చుకుంది. ఆ రోజు ఆదివారం కావడంతో మనవడు ఇంట్లోనే నిద్రపోతున్నాడు. కొంతసేపటికి వాడు నిద్రలేచి ఇంట్లో కొత్త ముఖాలు కనిపించడంతో ఏడుపు లంకించుకున్నాడు.

"లేదు నాన్నా...ఎవరొచ్చారో చూడు... ఈయన మీ తాతగారు, ఈవిడ మీ నాయనమ్మ" అంటూ ప్రమీల మెల్లగా బుజ్జగిస్తూ బాబును ఊరుకోబెట్టి "అత్తయ్యా! బాబుని చూడండి. మీకు, మామయ్యగారికి కాఫీ తెస్తాను" అంటూ వంటింట్లోకి వెళ్లింది.

అన్నపూర్ణ రాజేష్‌ని ఎత్తుకోవడంతో వాడు మరలా ఏడుపు మొదలుపెట్టాడు. మెల్లగా ఆ మాటా ఈ మాటా చెబుతూ వాడికి తాము తెచ్చిన బొమ్మలు చూపిస్తూ ఊరుకోబెట్టింది అన్నపూర్ణ.

"ఏమోయ్...అప్పుడే బాబంటే అంత ఇదిగా ఉందా" అంటూ ఆమెను వేళాకోళమాడాడు రాఘవరావు.

"ఊరుకోండురూ...అసలు కంటే వడ్డీ ముద్దని మన పెద్దలు ఊరికే అన్నారా" చురక అంటించింది అన్నపూర్ణ.

★★★

సాయంత్రం రాఘవరావుని, బాబును తీసుకుని ఆ ప్రక్కనేవున్న పార్కుకి వెళ్లాడు రవీంద్ర.

అత్తాకోడళ్లిద్దరూ కలసి రాత్రికి వంటని పూర్తి చేసి మగవాళ్ల రాకకోసం ఎదురుచూడసాగారు. వాళ్లు వచ్చిన తరువాత అందరూ సరదాగా నవ్వుకుంటూ భోజనాలు ముగించారు. వచ్చిన కొంతసేపటికే బాబు బాగా చేరిక కావడంతో అన్నపూర్ణ బాబుని తమ దగ్గరే పడుకోబెట్టుకుంది. వాడినే తృప్తిగా చూస్తూ తాను కూడా మెల్లగా నిద్రలోకి జారుకుంది అన్నపూర్ణ.

"చూడండి బాబు ఇంచక్కా ఎలా వాళ్ల నాయనమ్మ దగ్గర చేరికైపోయాడో!" ఎంతో ఆనందంగా తన భర్తతో చెప్పింది ప్రమీల. "పోనీలెండి. రేపటి నుండి వాడి ఆలనా పాలనా ఇంచక్కా అత్తయ్యగారే చూసుకుంటారు. ఇకనుంచి వాడిని క్రచ్‌కి పంపవలసిన అవసరంలేదు" అంటూ ఆనందంగా చెప్పింది.

"నిజమే. బాబుని మా అమ్మానాన్నలు చక్కగా చూసుకుంటారు. దానివల్ల వాళ్లకి కొంత కాలక్షేపం అవుతుంది" అన్నాడు రవీంద్ర. మొత్తానికి వాళ్ల రాక రవీంద్ర, ప్రమీలలకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

★★★

ఉదయాన్నే రాఘవరావుగారు, రవీంద్రలు మార్నింగ్‌వాక్ చేసుకుని వచ్చేసరికి అన్నపూర్ణ తన స్నానం, ధ్యానం ముగించుకుని వాళ్లకోసం కాఫీ టిఫిన్లు తయారుచేసింది.


సరదాగా కబుర్లు చెప్పుకుంటూ అందరూ ఎంతో ఆనందంగా కాఫీ టిఫిన్లు ముగించారు. మరలా కోడలికి, కొడుక్కి ఆఫీసు టైముకి వంట చేసి కేరేజీలు సిద్ధం చేసింది అన్నపూర్ణ.

"అత్తయ్యా! మీకెందుకీ శ్రమ? నేను ఇవన్నీ చేసేదాన్నిగా. మీరు హాయిగా రెస్టు తీసుకోండి" అంటూ ఎంతో అభిమానంగా చెప్పింది కోడలు ప్రమీల.

"ఊరుకోమ్మా ప్రమీలా. నాకిదేమైనా కొత్తా. నాకు మీ మామయ్యగారికీ పెందలాడే వంటచేసి పెట్టడం అలవాటే. ఇన్నాళ్ళుగా పని చేయడం అలవాటైన ఈ శరీరానికి ఒక్కసారిగా కూర్చోమంటే సాధ్యమేనా? అదీగాక ఆ పనీ ఈ పనీ చేయకపోతే నాకు కాలక్షేపం ఎలా అవుతుంది?" అంటూ నవ్వుతూ అంది అన్నపూర్ణ.

"సరే అత్తయ్యా...మీ ఇష్టం. మీరు ఎలా కావాలనుకుంటే అలా చేయండి" అంటూ ఆఫీసుకి టైమ్ అయిందంటూ బాబుకి ఎప్పుడెప్పుడు ఏమీ పెట్టాలో చెప్పి ఆఫీసుకు వెళ్లిపోయింది ప్రమీల. కొంతసేపటికి రవీంద్ర కూడా ఆఫీసుకి వెళ్లిపోవడంతో ఎంతో నిశ్శబ్దంగా అయిపోయింది ఇల్లు.

బాబు మంచి నిద్రలో ఉన్నాడు. రాఘవరావుగారు ఆ రోజు పేపరు చదువుతున్నారు. అన్నపూర్ణ కొంతసేపు అటూ ఇటూ తిరిగింది. ఆమెకూ ఏమీ తోచడంలేదు. చుట్టుప్రక్కల ఎవరున్నారా అని బయటకు వచ్చి చూసింది. ఆశ్చర్యంగా బయట ఎవరూ కనిపించలేదు. అందరి తలుపులు వేసేసే ఉన్నాయి.



అయ్యో పట్నవాసాల్లో ఇలాగే ఉంటారు కాబోలు, ఒకరికొకరికి సంబంధం లేకుండా. అదే విషయాన్ని భర్త రాఘవరావుతో అంది.

"ఇంకా అప్పుడే ఏం చూసావు. ఈ పట్నవాసుల పద్ధతులు, అలవాట్లు, ముందు ముందు నీకే తెలుస్తాయి'' అంటూ ఆమెను ఆట పట్టించాడు.


కొంతసేపటికి బాబు లేవడంతో వాడికి స్నానం చేయించి కొంత అన్నం తినిపించింది. వాడికి అన్నం తినిపించడానికి ఆమెకు తాతలు దిగి వచ్చారు. మొత్తానికి వాడిని ఇల్లంతా త్రిప్పుతూ ఏదో కొంత తినిపించగలిగింది. తరువాత వాడు కొంతసేపు ఆడుకుని మరలా పడుకున్నాడు. వాడు పడుకున్న తరువాత వాళ్ళు ఉభయులు కూడా తమ భోజనాలు ముగించి కొంతసేపు విశ్రమించారు. మధ్యాహ్నం బాబు లేచేసరికి వాడికి పట్టవలసిన పళ్లరసం తయారుచేసి త్రాగించి తాము కూడా టీ కలుపుకుని తాగారు రాఘవరావు దంపతులు. సాయంత్రంవేళ రాఘవగారు మనవడ్ని తీసుకుని అలా పార్కు వైపు వెళ్లారు. చీకటి పడుతున్నా కోడలు రాకపోవడంతో రాత్రి వంట మెల్లగా ప్రారంభించి పూర్తి చేసింది అన్నపూర్ణ.

"సారీ అత్తయ్యా...ఈరోజు ఆఫీసులో ఏదో పార్టీ ఉంటే తొందరగా రాలేకపోయాను. అనవసరంగా మీరు శ్రమపడి వంట చేసారు. రేపటినుండి నేను వచ్చిన తరువాతే మనిద్దరం కలిపి వంట చేసుకుందాము'' అంది ప్రమీల.

"ఫర్వాలేదమ్మా. అదీగాక ఆయనకు పెందలాడే భోజనం చేసి పడుకునే అలవాటు. లేటుగా తింటే అరాయించుకోవడం కష్టం'' అంది అన్నపూర్ణ.


"సరే అత్తయ్యా...నేను తొందరగా రెడీ అయి వచ్చేస్తాను. అప్పుడు అందరం కలసి ఒకేసారి తినేయవచ్చు'' అంటూ ఫ్రెష్ అవడానికి తన రూము లోకి వెళ్లిపోయింది ప్రమీల.

భోజనాల దగ్గర రవీంద్ర, ప్రమీలలు తమ ఆఫీసు విషయాలు చెబుతుంటే ఆశ్చర్యంగా వింటూ భోజనాలు ముగించారు రాఘవరావు దంపతులు. అలాగే ఆ రోజు వాళ్లకు వాళ్ల మనవడితో ఎలా కాలక్షేపం అయ్యిందో చెబుతూ ఆ దంపతులు కూడా ఎంతో మురిసిపోయారు.



## ఆకాంక్ష

ముంబైలో పుట్టి మిస్‌వరల్డ్-2000గా ఎన్నికైన ప్రియాంకాచోప్రా పుట్టింది జూలై 18, 1982. యూఎస్ఏలో హైస్కూల్ విద్యని అభ్యసించిన ప్రియాంకా యాక్టింగ్ కోర్సు కూడా చేసింది. ఫెమీనా ఇండియా వరల్డ్-2000గా ఎంపికైనా ప్రియాంకా జీవితం ఈ టైటిల్‌తో మలుపు తిరిగింది. అటు హిందీ, ఇటు తమిళ చిత్రాల్లో నటిస్తున్న ప్రియాంకా డేరింగ్ అండ్ డ్యాషింగ్ లేడీగా పేరు పొందింది. అనిల్‌కపూర్, సైయిఫ్ అలీఖాన్, సునీల్‌షెట్టి, బాబీడియోల్, అజయ్‌దేవ్‌గన్, సన్నీడియోల్‌తో కలిసి నటించిన ఈ భామ బాలీవుడ్‌లో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉందంటోంది.




***

రోజులు మెల్లగా సాగిపోతున్నాయి. ఇంటి బాధ్యత, వంట బాధ్యతతో పాటు పిల్లాడి బాధ్యతను కూడా అన్నపూర్ణకి అంటగట్టింది కోడలు ప్రమీల. తనకీ కొంత కాలక్షేపమేనంటూ అన్నపూర్ణ కూడా ఆ బాధ్యతను ఆనందంగా స్వీకరించింది. అయితే ఆమెకు, ఈ వయసులో అలా చిన్నపిల్లాడిని చూసుకోవడం కొంచెం కష్టంగానే ఉంది. ఐతే కోడలు ఏమనుకుంటుందోనని ఆ విషయాన్ని మనసులోనే దాచుకుంది.

ఆ రోజు ఆదివారం. అందరూ సరదాగా భోజనం చేస్తుండగా రవీంద్ర అన్నాడు.

"నాన్నగారూ! నాకు తెల్సిన బిల్డర్ ఒకతను అపార్ట్‌మెంట్‌లు కడుతున్నాడు. ఎంతకాలం మనం మాత్రం ఇలా అద్దెకొంపల్లో ఉంటాము. అందుకని ఒక అపార్ట్‌మెంట్ మీ పేరు మీద బుక్ చేద్దామనుకుంటున్నాను. ఏమంటారు'' అంటూ ఆయన అభిప్రాయం కోసం చూసాడు.

"ఆలోచన బాగానే వుంది బాబూ. తప్పకుండా నువ్వు ఒక ఇంటివాడివైతే మాకూ చూడాలని వుంది. అయితే ఇల్లు నా పేరుమీద ఉంటే నీకు లోను దొరకడం ఇబ్బంది అవుతుందేమో? అందుచేత ఇల్లు నీ పేరుమీదగానీ, కోడలు పేరుమీదగానీ తీసుకో'' అని చెప్పారాయన.

"ఇప్పుడు లోను తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది నాన్నగారూ. నేను ప్రమీల కలసి కొంత డబ్బు కూడబెట్టాము. దానికి సాయంగా మీరు కొంచెం సర్దితే హాయిగా లోను లేకుండా ఇల్లు కొనుక్కోవచ్చు. ఏమంటారు'' అంటూ తండ్రివైపు చూసాడు రవీంద్ర.

"బాగానే ఉంటుంది బాబూ. ఐతే నేను నీకు డబ్బు సర్దే స్థితిలోలేను. ఎందుకంటే నాకు రిటైర్‌మెంట్‌వల్ల వచ్చింది చాలా తక్కువ. చాలామటుకు అక్కయ్య పెళ్లికి, నీ చదువుకి చేసిన అప్పులు తీర్చడానికే సరిపోయింది. ఇంక మిగిలిన కొంతైనా ముందు ముందు మా మందులకు పనికివస్తుందేమోనని ఉంచుకున్నాము'' అంటూ ఎంతో బాధగా చెప్పారు రాఘవరావుగారు.

"అదేంటి నాన్నగారూ! అక్క పెళ్లికిగానీ, నా చదువుకుగానీ అప్పు చేసినట్లు ఎప్పుడూ మీరు మాకు చెప్పలేదు'' అంటూ మూతి ముడుచుకున్నాడు రవీంద్ర.

"ఏం చెప్పమంటావు బాబూ. అప్పుడు నీది చదువుకోవాల్సిన వయసు. అక్కకి తప్పక పెళ్లి చేయాల్సిన వయసు. ఆ వయసులో నీకివన్నీ చెప్పడం ఇష్టంలేక చెప్పలేదు. అలాగే మన తాహతుకి మించినదైనా అక్కకి మంచి సంబంధమే చేయగలిగాను. నిన్ను కూడా ఎక్కువ డబ్బు ఖర్చయినా మంచి చదువే చదివించగలిగాను'' అంటూ సంజాయిషీగా చెప్పారు.

"ఏంటి నాన్నగారూ! మీరు ఎంతో కొంత సాయం చేస్తారు, ఇంచక్కా

ఇంటిని కొనుక్కోవచ్చునని ఆశగా మేమిద్దరం ఉన్నాం. ఇప్పుడు మీరేమోనా దగ్గర డబ్బులు లేవు, ఉన్నా మాకోసం కావాలని అంటున్నారు. మరి ఇప్పుడెలా'' కొంచెం బాధగా అన్నాడు రవీంద్ర.

"పోనీలేరా ఏదైనా బ్యాంకునుండిగానీ, మీ కంపెనీ నుండిగానీ లోనుకి ట్రై చేయి. ఇద్దరూ సంపాదిస్తున్నారుకదా. తొందరగానే లోను తీర్చేసుకోవచ్చు'' అంటూ తనకు తోచిన సలహాని చెప్పారాయన.

"కుదరదు నాన్నగారూ... కారు నిమిత్తం నేను, తన చెల్లెలి పెళ్లి నిమిత్తం ప్రమీల ఇప్పటికే లోను తీసుకున్నాం. అది పూర్తయితేగానీ మరలా మాకు లోనివ్వరు'' అంటూ అసలు విషయం తండ్రికి చెప్పాడు రవీంద్ర.

"అవునురా రవీంద్రా...నీకు లోను తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది'' అడిగారు రాఘవరావుగారు.

"అదేంటి నాన్నగారూ...మా కంపెనీలో అందరికీ కార్లున్నాయి. వాళ్ల ముందు నా స్టేటస్ ఏమవ్వాలి'' ప్రశ్నించాడు రవీంద్ర.

"మరి కోడలు వాళ్ల చెల్లెలు పెళ్లికి అంత లోను తీసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది?'' ప్రక్కనే వున్న అన్నపూర్ణ ఉండబట్టలేక అడిగింది.

"ఏం చేయమంటారు అత్తయ్యగారూ! అబ్బాయి అమెరికాలో ఇంజనీరు. కొంచెం కట్నం ఎక్కువ ఇస్తేనేగానీ పిల్లని చేసుకోమన్నారు. అందుకని నాన్నగారికి కట్నంలో కొంత సాయం చేసాము తప్పా'' నిలదీసింది కోడలు ప్రమీల.

"తప్పనికాదమ్మా. మనం మన తాహతులెరిగి ప్రవర్తించాలి'' సర్ది చెప్పబోయారు రాఘవరావుగారు.

"ఏంటి...మనం మన తాహతులెరిగి ప్రవర్తించాలా? మరి ఆడబడుచు నిర్మలకి మన తాహతుకి సరిపడా సంబంధమే చేసారా మామయ్యగారూ'' ఎదురు ప్రశ్న వేసింది ప్రమీల.

"నిజమేనమ్మా. నా తాహతుకి మించే చేసాను. ఎందుకంటే మనం పిల్లని మనకన్నా ఎక్కువ ఉన్నవాడి ఇంటికి ఇచ్చుకోవాలి. అలా చేస్తే అక్కడ మన పిల్ల సుఖపడుతుందనే స్వార్థంతో. అంతేకానీ నీతో ఇలా మాటలు పడడానికి కాదమ్మా'' అంటూ కొంచెం గట్టిగానే చెప్పారు రాఘవరావుగారు.

దాంతో ప్రమీలకి కోపం వచ్చి అక్కడినుండి రుసరుసలాడుతూ తన గదిలోకి వెళ్లిపోయింది. వెనకాలే రవీంద్ర కూడా ఆమెను ఓదార్చడానికి వెళ్లిపోయాడు. అంతవరకూ ఎంతో ఆనందంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఏమీ తెలియని బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

★★★

ఆ రాత్రంతా రాఘవరావుగారు, అన్నపూర్ణలు ఆలోచనలతో నిద్రకు దూరమయ్యారు. సరైన నిద్ర లేకపోవడంతో ఆవిడకు కొంచెం నీరసం అనిపించి బారెడు ప్రొద్దెక్కినా బద్ధకంగా ఇంకా పడుకునే ఉన్నారు. రాఘవరావుగారు కూడా ఆ రోజు మార్నింగ్‌వాక్‌కి వెళ్లలేకపోయారు. కోడలు ప్రమీల మాత్రం సణుక్కుంటూ, గొణుక్కుంటూ తన పనులు చేసుకుంటుంటే కొంతసేపటికి అన్నపూర్ణ లేని ఓపికని తెచ్చుకుని వంట ప్రయత్నం చేయబోయారు.

"ఎందుకులెండి మీకు లేనిపోని శ్రమ? నేనే చేస్తాను. లేకపోతే అన్ని పనులు అత్తయ్యమీద వేసిందని నలుగురు నన్ను అనుకోగలరు'' అంటూ విసవిసా అక్కడినుండి వెళ్లిపోయింది ప్రమీల.

ఎంతో ఆత్మాభిమానంతో బ్రతికిన అన్నపూర్ణకి ఆ మాటలు కొరడా దెబ్బల్లా అనిపించాయి. 'ఏనా చిన్నపిల్ల...నిన్న జరిగినది మనసులో ఉంచుకుని ఇలా మాట్లాడుతోంది. కొన్నిరోజులు పోతే తనే సర్దుకుంటుంది' అని ఆమె మనసుకి సర్ది చెప్పుకుంది.

★★★

ఒకరోజు రాత్రి చేసిన రొట్టెలు, కూరలు మిగిలిపోయాయని పనిమనిషికి ఇస్తుంటే "ఇలా మీరు ఉన్నవన్నీ అందరికీ దోచిపెడితే ఇంక మనకు మిగిలేది చిప్పే'' అంటూ పనిమనిషి ముందే ఆమెను తూలనాడింది. ఇంకోసారి పొయ్యిమీద పాలు పెట్టి బాబు ఏడుస్తున్నాడని చూడడానికి వెళ్లిన అన్నపూర్ణ వచ్చేలోపు పొయ్యిమీద పాలు కాస్తా పొంగిపోయాయి. దానికి రవీంద్రని పిలిచి నానా రాద్ధాంతం చేసింది ప్రమీల. అలాగే అత్తగారితో అయినదానికీ కానిదానికీ అనవసరంగా వాదించేది ప్రమీల.

ఇలా రోజురోజుకీ ప్రమీల నోటికి హద్దు ఉండకపోవడంతో అదే విషయాన్ని తన భర్త రాఘవరావుతో చెప్పుకుని బాధపడింది అన్నపూర్ణ.

"ఊరుకో అన్నపూర్ణా...నేనూ చూస్తున్నాను కోడలి ప్రవర్తన. ఎంతైనా వాళ్ళు మన కొడుకు కోడలూను. అదీగాక ఇప్పుడు మనకు వీళ్ళు తప్ప వేరెవరూ దిక్కులేరు. కష్టమైనా, నష్టమైనా అనుభవించక తప్పదు'' అంటూ ఆమెను సముదాయించారు.


## వింత ప్రదర్శన

బ్రిటన్‌కు చెందిన వ్యంగ్య చిత్రకారుడు బేంక్సీ. అమధ్య శ్రీమంతులమయమైన లాస్‌ఏంజెలెస్‌లో ఒక గిడ్డంగిలో ధనిక వ్యవస్థని విమర్శించే ప్రదర్శనని ఏర్పాటుచేశాడు. అందులో ఒక దేవత నీలాకాశం నుంచి పారాచ్యూట్‌లో దిగివస్తూ భూ వాతవరణానికి తట్టుకోలేక గ్యాస్‌మాస్క్ పెట్టుకున్న చిత్రమది. ఎర్రగా పెయింట్ చేసి అక్కడక్కడ బంగారవు రంగులో బొమ్మలు గీసిన అసలైన ఆసియా ఏనుగుని తనదైన శైలిలో విమర్శించే ఈచిత్రకారుడు ఎవరికీ కనిపించడు గాని ప్రపంచంలో పలు దేశాల్లో ప్రసిద్ధికెక్కిన మ్యూజియంలోను, జ్యూల్లోను చివరికి వీధుల్లోనూ అతని ప్రదర్శనలు కనిపిస్తుంటాయి.

## పచ్చ భూతం

ఉత్తర మలేషియాలో ప్రాయి అనే గ్రామంలో ఒక వక్క వృక్షం మీద భూతంలాంటి మనిషి ముఖం మొలుచుకు వచ్చిందట. ఏడుమీటర్ల ఎత్తున్న ఈ చెట్టుమీదున్న ముఖాన్ని చూడ్డానికి జనం తండోపతండాలుగా వస్తున్నారుట.

-తటవర్తి



"మీరు ఏమైనా చెప్పండి. కోడలి ప్రవర్తన నాకు అస్సలు నచ్చడంలేదు. నాకు ఇప్పుడు గుర్తుకువస్తోంది. మనం ఇక్కడికి వచ్చేముందు ఒకరోజు మన పక్కింటి పిన్నిగారు...అదేనండీ సావిత్రిగారు లేరు ఆమెతో అన్నాను మేము కొద్దిరోజుల్లో మా అబ్బాయి దగ్గరకు శాశ్వతంగా వెళ్లిపోతామని. ఆవిడ వెంటనే నవ్వారండీ.

'ఏం పిన్నిగారూ ఎందుకు నవ్వుతున్నారంటే?', 'ఏంలేదు అన్నపూర్ణా...అడ్డాలనాడే బిడ్డలుగానీ గెడ్డాలు వచ్చిన తరువాత కాదని' ఆవిడ ఆమె కొడుకూ, కోడలితో పడ్డ మాటలు, కష్టాలు చెప్పుకుని బాధపడ్డారండీ. ఏమైనా పిన్నిగారు మా రవీంద్ర, కోడలు ప్రమీల అటువంటివారు కాదని ఆమెతో అన్నానండీ. అంటే ఆవిడ అన్నారూ... 'అన్నపూర్ణా...ఈరోజుల్లో చాలామంది కొడుకులు, కోడళ్ళు అలాగే ఉన్నారు. అందుకని ముందుగానే మనల్ని వాళ్ళు ఏమన్నా ఫర్వాలేదని సర్దుకునిపోతే ఫర్వాలేదు. లేకుంటే అంతకన్నా నరకం మరోటి ఉండదు అంటూ ఈనాటి కొడుకుల గురించి, ఎంతో చక్కగా చెప్పారండీ. ఆవిడ మాటల్లోని అంతరార్థం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది నాకు. ఇప్పుడు మన కొడుకు, కోడలు కూడా అలాగే ప్రవర్తిస్తున్నారు. ఏమండీ మనం ఇక్కడికి వచ్చి తప్పు చేసామంటారా?" ఎంతో అమాయకంగా అడిగింది తన భర్తని అన్నపూర్ణ.

"ఏమో అన్నపూర్ణ... అది నేను మాత్రం ఎలా చెప్పగలను. మన నిర్ణయం సరైనదా కాదా అన్నది కాలమే నిర్ణయించాలి" వేదాంతిలా మాట్లాడారు రాఘవరావు.

అంతలో కొడుకు, కోడలు రావడంతో వాళ్లిద్దరి సంభాషణకు బ్రేక్ పడింది. తాము రావడంతో వాళ్లిద్దరు మాట్లాడుకోవడం మానేయడం చూసి ప్రమీల రవీంద్రతో "చూసారాండీ...మనమీద ఏదో చెప్పుకుంటున్నారు వాళ్ళు. మనం రావడం చూసి మాటలాపేసి ఏమీ తెలియని నంగనాచుల్లా కూర్చున్నారు" అంది.


## మ్యూజియంలో తుంటరి

చైనాలో 2200 ఏళ్ల నాటి క్విన్సుయాంగ్ చక్రవర్తి కాలంలో టెర్రకోటా యోధులు ప్రసిద్ధి. పురాతన రాజధాని సియోల్‌లో చక్రవర్తి సమాధి ప్రక్కన యోధుల శిలా విగ్రహాలతో ఒక మ్యూజియం ఉంది. పాబ్లో వెండల్ అనే 26ఏళ్ళ జర్మన్ ఆర్ట్ విద్యార్థి ఆ మధ్య ఈ మ్యూజియం సందర్శించడానికి వచ్చాడట. అతను చిన్నప్పట్నించి ఆ మ్యూజియం గురించి బాగా విన్నాడు. స్వయంగా చూశాక స్ఫూర్తి చెంది ఓ రోజున టెర్రకోటా యోధునిలా డ్రెస్ చేసుకుని ఆ శిలా విగ్రహాల నడుమ తనూ ఓ బొమ్మలా నిలబడ్డాడు. అతనెక్కడున్నాడో అన్ని వందల విగ్రహాల్లో తెలియక తలలు పట్టుకున్నారు సెక్యూరిటీ వాళ్ళు. చివరికి పురావస్తు శాస్త్రజ్ఞుల సాయంతో అతన్ని వెతికి పట్టుకున్నారు. అతని పనివల్ల విగ్రహాలకే నష్టమూ కలగలేదు కనుక బాగా స్టడీ చేయక ఈ పిచ్చి పనేమిటని మందలించి అతని చేత యోధుని డ్రెస్సుని మాత్రం విప్పించి పంపించారుట.

## బాతుల నడుమ విహారం

ఇల్లినాయిస్ నదిలో ప్రతియేటా డక్‌రేస్ జరుగుతుంది. ఇటీవల 18వ వార్షిక బాతుల పోటీ జరుగుతున్న వేళ 15వేల పసుపుపచ్చ రబ్బరు బాతుల్ని ఆ నదిలో వర్తులాకాలంలో తేలనిచ్చారుట. వాటి నడుమ రిచార్డ్ మెక్ డోనాల్డ్ తన కయాక్‌లో తెడ్డు వేస్తున్నాడు.

-తటవర్తి




★★★

ఫోను రింగవడంతో "హలో ఎవరూ..." అంటూ నవ్వుతూ పలకరించింది ప్రమీల.

"అరె...అన్నయ్యా... నువ్వా? ఏంటన్నయ్యా ఇంకా విశేషాలు? వదిన, అమ్మా నాన్నా ఎలా ఉన్నారు?" గుక్క తిప్పుకోకుండా ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపిస్తోంది ప్రమీల.

"అన్నయ్య నువ్వు కడుతున్న కొత్త ఇల్లు ఎంతవరకు వచ్చింది?"

"అబ్బా ప్రమీలా...అన్ని ప్రశ్నలు ఒకేసారి వేస్తే ఎలాగమ్మా. అన్నింటికీ జవాబులు ఒకేసారి చెప్పడం కష్టం" అంటూ ముద్దుగా కోప్పడ్డాడు చెల్లెల్ని శ్రీనివాస్.

"ఇంతకీ నేనెందుకు ఫోన్ చేసానంటే త్వరలో నువ్వు, బావగారూ ఇక్కడికి రావాలమ్మా" అన్నాడు.

"ఎందుకన్నయ్యా? ఏమైనా విశేషమా?" అడిగింది ప్రమీల.

"అదేనమ్మా నేను త్వరలో ఇంటి ఓనర్ని కాబోతున్నానుకదా. దాని గృహ ప్రవేశానికి నువ్వు, రవీంద్రలు తప్పకుండా రావాలి. ముందుగా చెబితే ఆఫీసు సెలవులు అవీ చూసుకుంటారని చెబుతున్నాను" ఆనందంగా చెప్పాడు శ్రీనివాస్. "అలాగే నేను మీ వదినా త్వరలోనే వచ్చి నిన్ను, బావగార్ని స్వయంగా పిలుస్తానని చెప్పు" అన్నాడు.

"అలాగే...కంగ్రాట్స్ అన్నయ్యా. నేను మీ బావగారు తప్పకుండా వస్తాం" అంటూ ఎంతో సంతోషంగా ఫోన్ పెట్టేసింది . అయితే ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు ఎందుకంటే ఎదురుగా అత్తమామల్ని చూసేసరికి. వాళ్ళు తాము ఇల్లు కొనుక్కుంటున్నామంటే సహాయం చేయలేదనే కోపంతో.

★★★

అన్న ప్రకారమే ప్రమీల అన్నయ్య, వదినలు వచ్చి రాఘవరావు దంపతులను కుశల ప్రశ్నలువేసి ప్రమీల, రవీంద్రలతోపాటు వాళ్లని కూడా తమ ఇంటి గృహ ప్రవేశానికి రమ్మనమని ఎంతో సాదరంగా ఆహ్వానించారు.

"చూద్దాం బాబూ..." ఎంతో ఆత్మీయంగా చెప్పారు రాఘవరావుగారు.

రెండుమూడు గంటలున్న తరువాత "ఇక బయలుదేరుతాం చెల్లెమ్మా" అంటూ చెప్పాడు ప్రమీల అన్నయ్య.

"అదేంటన్నయ్యా...రాకరాక వచ్చారు. భోజనం చేయకుండా వెళ్లిపోతారా?" నిష్ఠూరంగా అంది ప్రమీల.

"భోజనానిదేముందమ్మా ఈసారి తీరుబడిగా వచ్చి అత్తయ్యగారి చేతి వంట తింటూ హాయిగా నీ దగ్గరే రెండు మూడురోజులుంటాము" అంటూ చెల్లెలికి నచ్చచెప్పారు ఆమె అన్నా వదినెలు.

"సరే మీ ఇష్టం" అంటూ మూతి ముడుచుకుంది ప్రమీల.

అయితే ప్రమీలకు తెలియని విషయం ఒకటుంది. ఆమె అన్నయ్యా వదినలు అత్తమామలపట్ల తన ప్రవర్తనని తెలుసుకున్నారని. దారిలో వెళుతున్నప్పుడు కూడా అదే విషయం గురించి ఆమె అన్నా వదినలు చర్చించుకున్నారని.

"ఏమండీ... ఏమైనా మన ప్రమీల ప్రవర్తన నాకేమీ నచ్చలేదండీ. అత్తమామల్ని చూసుకోవాల్సిన తీరు ఇదేనా? వాళ్లకు వీళ్లు తప్ప ఎవరున్నారు? ఎలాగైనా ఆమెలో మనం మార్పుని తీసుకురావాలి" అంది ప్రమీల వదిన సుమ.

"అలాగే తప్పకుండా. ప్రమీలను మార్చడానికి ఏదో ఒకటి చేద్దాం" అన్నాడు శ్రీనివాస్.

***

ప్రమీల అన్నయ్య ఇంటి గృహ ప్రవేశానికి వెళ్లడానికి సన్నద్ధమవుతోంది. అయితే అనుకోకుండా రెండురోజులుగా అన్నపూర్ణ మూసిన కన్ను తెరవకుండా పడి వుంది. డాక్టర్లయితే ఆమెకు న్యూమోనియా అని చాలా జాగ్రత్తగా చూసుకోమ్మని చెప్పారు. ప్రమీల పెట్టె బేడా సర్దుకుని రవీంద్రను కూడా బయలుదేరమని బలవంతం చేసింది.

"ఏంటి ప్రమీలా! అమ్మకి ఇలా వుంటే ఎలా వెళ్లగలం? ఉండు మీ అన్నయ్యకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించి రాలేకపోతున్నందుకు సారీ చెప్తాను" అన్నాడు.

"బాగుంది మీ వ్యవహారం. అవతల ఒక్కగానొక్క అన్నయ్య గృహప్రవేశం చేసుకుంటుంటే చెల్లెల్ని నేను వెళ్లకపోతే ఏం బావుంటుంది. నలుగురు నా గురించి ఏమనుకుంటారు? అయినా మీ అమ్మగారికి ఏమీ కాదులెండి. మీరు త్వరగా బయలుదేరండి" అంటూ హడావుడి చేసింది.

"ఏమైనా ప్రమీలా... వాళ్లని ఈ స్థితిలో వదిలి వెళ్లడం అంత భావ్యం కాదు" నచ్చచెప్పబోయాడు రవీంద్ర.

"చూడండి. మీరు ఎన్ని చెప్పినా వినేదిలేదు. మీరు వస్తారా సరే. లేకపోతే నేను ఒక్కదాన్నయినా వెళ్తానుగానీ ఈ ప్రయాణం మాత్రం మానను" తెగేసి చెప్పింది ప్రమీల.

'వదలమంటే పాముకి కోపం, కరవమంటే కప్పకి కోపం' ఇప్పుడు రవీంద్ర పరిస్థితి కూడా అంతే. అతనికి ఇటు తల్లి కావాలి, అటు భార్య కావాలి. ఏం చేయాలో ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు.

అంతలో రాఘవరావుగారు అక్కడికి వచ్చి "బాబూ రవీంద్రా ఒక్కమాట. ఇప్పుడు మీ అమ్మకి వచ్చిన ఇబ్బందేమీలేదు. ఐనా డాక్టర్ వచ్చి చూసి వెళ్తున్నాడుగా. కనుక నువ్వు, కోడలు మీ బావమరిది ఇంటి గృహ ప్రవేశానికి వెళ్లిరండి" అని చెప్పి వాళ్లను వెళ్లేలా చేసారు.

***

ప్రమీల ఎంతో హుషారుగా అన్న ఇంటికి వచ్చింది. అయితే అక్కడ తన తల్లిదండ్రుల విచార వదనాన్ని చూసి ఆశ్చర్యపోయింది. కొడుకు హాయిగా ఇల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేసుకుంటుంటే ఆనందించాల్సిందిపోయి వీళ్లేమిటి ఇలా విచారంగా ఉన్నారు?

విషయం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించింది. ప్రమీల తల్లిదండ్రులు వచ్చి ఆప్యాయంగా కూతుర్ని, అల్లుడ్ని పలకరించారు. తొందరగా స్నానం చేస్తే భోజనం చేసి కబుర్లు చెప్పుకోవచ్చునని ఆమె తల్లి చెప్పడంతో ప్రమీల ప్రస్తుతానికి ఆ విషయాన్ని పక్కన పెట్టింది. భోజనాల దగ్గర కూడా ఆమె తల్లిదండ్రులు ముభావంగా ఉండడంతో తనకి తెలియని విషయాన్నేదో తన వాళ్ళు తన దగ్గర దాస్తున్నారని ఆమె గ్రహించింది. సర్లే... ఆ విషయాన్ని నెమ్మదిగా తెలుసుకోవచ్చునని ఊరుకుంది.

***

ఆ రోజు రాత్రి పెరట్లో ఆమె తల్లీతండ్రీ, రవీంద్ర కూర్చుని కబుర్లు చెప్పుకొంటుండగా బాబు లేచినట్లు అవడంతో బాబుని తీసుకుని దానడానికి వెళ్తున్న ప్రమీలకి అన్నయ్య గదిలో నుండి ఆమె అన్నావదినల నోట తన తల్లిదండ్రుల ప్రస్తావన రావడంతో ఆగి వారి మాటలు వినసాగింది.

"మొత్తానికి సాధించావు సుమా" అంటూ ఆమెను మెచ్చుకుంటున్నాడు ప్రమీల అన్నయ్య శ్రీనివాస్.

"మరేమనుకున్నారు ఈ సుమ అంటే? లేకపోతే మీ నాన్నగారు మీకు ఇంటి నిమిత్తం డబ్బు ఇవ్వనంటారా? అయినా రేపో మాపో పోయేవాళ్లకి ఎందుకండీ డబ్బు మీద అంత మమకారం. వృద్ధాప్యంలో డబ్బు పనికొస్తుందిట. ఎంత నంగనాచిలా చెప్పారు మీ అమ్మగారు" వ్యంగ్యంగా అంటోంది వదిన సుమ.

"ఏమండీ ఇంకో విషయం. ఈ గృహప్రవేశం హడావుడి అయిపోయిన తరువాత మెల్లగా వాళ్లకి నచ్చచెప్పి వాళ్లని ఏ వోల్డేజ్ హోమ్‌కో, లేక మీ చెల్లెలి



## చిరునామా

ఎంటీవీని వీక్షించే వారికి అమృతాఅరోరా గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ప్యార్‌కియాతో దర్నాక్యా చిత్రంలో 'ఓ ఓ జానె జానా' పాట ఈమెకి మంచి పాపులారిటీని తెచ్చిపెట్టింది. జనవరి 31న పుట్టిన అమృతా అరోరా ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. అంతేకాదు ఆమె మీనాల్లాంటి గుండ్రటి కళ్ళు అందర్నీ పలకరిస్తూ ఉంటాయి. మిగతా తారల్లాగే మోడలింగ్‌తో రాణించిన అమృతా ఫర్దీన్‌ఖాన్‌తో కలిసి నటించిన 'కిత్‌నె దోర్ కిత్నె పాస్' చిత్రంతో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది.



దగ్గరికో పంపించివేయండి. ఎందుకంటే ఈ మధ్యన మీ అమ్మగారి ఆరోగ్యం కూడా ఏమీ బాగుండడంలేదు. ఆవిడగారిని కూర్చోబెట్టి చేసే ఓపిక, ఖర్మ నాకే మీలేదు. నేను నా పనులే సరిగ్గా చేసకోలేకపోతున్నాను. ఏదో ఇంతకాలం ఆవిడకు ఓపిక ఉండి మనకి చేసి పెట్టారు. మనం హాయిగా కూర్చుని తిన్నాము. కాబట్టి ఇకమీదట ఆవిడకు చేయడం నావల్లకాదు. అందుచేత మీకు ముందే చెప్తున్నాను. వాళ్ల విషయమై ఏదో ఒకటి ఆలోచించండి'' అంది సుమ.

"సర్లే.. నాకుమాత్రం తెలియదా. ఏదో ఇంతకాలం వాళ్ల దగ్గర డబ్బుంది కాబట్టి ప్రేమని కురిపించాము. ఇంక వాళ్ల దగ్గర ఏముంది బూడిద. నువ్వేం కంగారుపడకు. వాళ్ళ విషయం నేను చూసుకుంటాను'' అంటూ ఆమెకు అభయమిచ్చాడు శ్రీనివాస్.

ప్రమీల వాళ్ల సంభాషణ ఇక వినలేకపోయింది. 'ఛ... అసలు వీడు నాకు అన్నయ్యేనా? కన్న తల్లిదండ్రుల గురించి ఇలా మాట్లాడడానికి వాడికి సిగ్గుగా లేదు. అమ్మానాన్నలని అలా ఆడిపోసుకోవడానికి వాళ్లకి నోరెలా వచ్చింది.



## ద్విపాత్రాభినయం

1979లో ముంబైలో ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన యుక్తా ముఖి 1999లో మిస్ ఇండియా రన్నరప్‌గా ఎంపికై అదే ఏడి మిస్‌వరల్డ్ కిరీటాన్ని చేజిక్కించుకుంది. పైసాలో నటించిన యుక్తా త్వరలో విడుదల కానున్న ముత్తులో నటిస్తోంది. ఎప్పుడూ కొత్తదనం కోసం పరితపించే యుక్తా సినిమాలతో పాటూ తనకి మంచి పేరు తెచ్చిన మోడలింగ్‌లో కూడా రాణిస్తూ ద్విపాత్రాభినయం చేస్తోంది.




చిన్నప్పటినుంచీ పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులపట్ల కొడుకుగా వాడు ప్రవర్తించవలసిన తీరు ఇదేనా? వీడికి అమ్మానాన్నల విలువ ఎప్పుడు తెలిసివస్తుంది? తన వదినకి అత్తమామల విలువ, వాళ్ల మంచితనం గురించి ఎప్పుడు తెలిసి వస్తుంది? ఛ...వీళ్లకి డబ్బే సర్వం అయిపోయింది. అంతకుమించిన ప్రేమాభిమానాలు ఒకటున్నాయని మర్చిపోయారు. వీడేకాదు, ఈ రోజుల్లో అందరూ అలాగే ఉంటున్నారు. వీళ్లకు పెద్దవాళ్లు బ్రతికుండగా వారి విలువ తెలియదు. వాళ్ళు లేనిరోజున వాళ్ల విలువ తెలిసి మాత్రం ఏం ప్రయోజనం?' పెద్ద వేదాంతిలా ఆలోచించింది.

ఇంకా అక్కడే ఉంటే వాళ్ల నోటివెంట ఇంకా ఎలాంటి మాటలు వినవలసి వస్తుందోనని తిరిగి తన తల్లిదండ్రులు ఉన్నచోటికి వచ్చేసింది ప్రమీల.

అక్కడ కూడా తన తల్లిదండ్రులు తమ కష్టాన్నంతా రవీంద్రకు చెప్పుకుని ఏడుస్తున్నారు.

"నాన్నా! ఇన్ని జరుగుతున్నా మీరు నాకు ఒక్కసారి కూడా ఎందుకు చెప్పలేదు. నాకు ఇవన్నీ ముందే తెలిసి వుంటే వాడిని నాలుగు ఛెడామడా దులిపేసేదాన్ని'' ఆవేశంగా అంది ప్రమీల.

"ఊరుకో ప్రమీలా...నీవు చిన్నపిల్లవు. అయినా పెద్దవాళ్ళుగా ఇవి మాకు తప్పవమ్మా. ఎందుకంటే మేం ఇప్పుడు వాడిమీదే ఆధారపడి ఉన్నాం. ఏది ఎలా ఉన్నా వాడి దగ్గరే మా రోజులు తీరిపోవాలి. ఎంతైనా వాడు మా కొడుకమ్మా. రేప్పొద్దున మాకు కొరివి పెట్టి పున్నామ నరకం నుండి తప్పించవలసిన వాడమ్మా'' ఎంతో బాధగా చెప్పారాయన.

"ఏంటీ వాడు మీకు కొడుకా? బ్రతికుండగానే మీకు నరకాన్ని చూపిస్తున్నాడు. వాడు మిమ్మల్ని పున్నామ నరకం నుండి ఎలా తప్పిస్తాడు నాన్నా'' వ్యంగ్యంగా అంది ప్రమీల.

"సర్లే ప్రమీలా...అది మా ప్రారబ్ధం. ఎలా జరిగేది అలా జరగకమానదు. అల్లుడుగారు చెబుతున్నారు. వాళ్ల అమ్మానాన్నలు వచ్చేరట కదమ్మా. వాళ్లకి ఎన్నటికీ మా పరిస్థితిని రానీయకమ్మా. వాళ్లని జాగ్రత్తగా చూసుకో తల్లీ. తల్లయినా తండ్రయినా ఇంక నీకు వాళ్లేనమ్మా'' అంటూ తండ్రి మాటలు ఛెళ్ళున చెంపమీద కొట్టినట్లనిపించాయి ప్రమీలకు.

'నిజమే! తన తల్లిదండ్రుల్ని అలా చూసినందుకు తన అన్ననీ, వదినను అసహ్యించుకుంది. మరి తనో? తాను కూడా అదే తప్పు తన అత్తమామల విషయంలో చేసిందికదా. మరి తనకు శిక్ష ఏమిటి? తాను ఎంత అమానుషంగా వాళ్లపట్ల ప్రవర్తించింది? తన అత్తగారు కన్ను తెరువలేని స్థితిలో ఉన్నారని తెలిసి కూడా తానెంతో మూర్ఖంగా తనవాళ్ళు, తన ఆనందం అంటూ వాళ్లమీద కక్ష తీర్చుకునే ఉద్దేశ్యంతోనే ఇక్కడకు వచ్చింది. తన అన్న చేసిన తప్పే వాళ్ల కొడుకుగా రవీంద్ర కూడా చేస్తున్నాడు. దానికి తాను తన వదినలా వత్తాసు పలుకుతోంది. ఇంక రవీంద్రకు తన అన్నకూ, వదినకు, తనకూ తేడా ఏముంది?

ఆమెలో అంతర్మథనం మొదలయింది. ఆమెకు ఆమె తండ్రి అన్న మాటలు కనువిప్పుని కలిగించి జ్ఞానోదయం అయ్యేలా చేసాయి. ఆమె తన తప్పు తాను తెలుసుకుంది. అంతేకాదు, తన అత్తమామల విలువ కూడా తెలుసుకుంది. ఈ వయసులో వాళ్లకి తమలాంటి వాళ్ల అండదండలు ఉండాలనీ, అలాగే బాబుకి తాతయ్య, నానమ్మల ప్రేమని దూరం చేసే హక్కు తనకు లేదని తెలుసుకుంది. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చితం వేరేలేదని, ఇంక తానెప్పుడూ తన అత్తమామలను ఇంటి విషయంలోనే కాదు, ఇంక ఏ విషయంలోనూ బాధపెట్టకూడదని గట్టిగా నిర్ణయించుకుంది. ఆమె కళ్లవెంట ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు కారాయి. ఆమె కళ్లను కప్పిన అజ్ఞానపు పొరలు కన్నీటితో కరిగిపోయాయి.

అక్కడే ఉన్న రవీంద్రతో "ఏమండీ! వెంటనే మన ఊరికి బయలుదేరండి. ఇంక నేను ఇక్కడ ఒక్కక్షణం కూడా ఉండను'' అంటూ అప్పటికప్పుడే బయ

లుదేరింది ప్రమీల. విషయం అర్థంకాని రవీంద్ర కొడుకును తీసుకుని ఆమె వెనుకే బయలుదేరాడు. రాత్రంతా ప్రమీల మెలకువగానే ఉండి ఏదో ఆలోచిస్తోంది. మధ్యమధ్యలో ఏడుస్తున్నట్లుగా ఉంది. విషయం అర్థంకాని రవీంద్ర ఆమెను పలకరించే సాహసం చేయలేకపోయాడు.

★★★

ఉదయాన్నే ఇంటికి తిరిగి వచ్చిన రవీంద్ర ఇంటికి తాళం చూసి గతుక్కుమన్నాడు. మనసు ఏదో కీడుని శంకించింది. అంతలో ప్రక్కింటావిడ "నిన్న మీరు వెళ్లిన తరువాత మీ అమ్మగారికి బాగా సీరియస్ అయితే హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. మీరొస్తే మీకిమ్మని ఈ తాళం చెవులు ఇమ్మన్నారు" అంటూ ఇంటి తాళం చెవులు అందించింది.

ఇంటి తాళం చెవులు తీసుకున్న ప్రమీల "ఏమండీ! మనం వెంటనే హాస్పిటల్‌కు వెళ్దామండీ. అత్తయ్యగార్ని నేను వెంటనే చూడాలి" అంటూ వచ్చిన ఆటోలోనే హాస్పిటల్‌కు బయలుదేరింది ప్రమీల.

హాస్పిటల్‌లో రాఘవరావుగారు భార్య బెడ్ ప్రక్కనే విచారంగా కూర్చుని ఉన్నారు. ఆమెకు సెలైన్ ఎక్కిస్తున్నారు. అన్నపూర్ణ అచేతనంగా ఈ లోకంతో సంబంధం లేనట్లుగా మంచంమీద పడుకుంది.

కొడుకుని, కోడల్ని చూసిన రాఘవరావుగారు దుఃఖం ఆపుకోలేపోయారు. మూగగా తన భార్యని చూపిస్తూ కన్నీళ్లు వత్తుకుంటున్నాడు.

"నన్ను క్షమించండి మామయ్యా...ఇదంతా నావల్లే జరిగింది" అంటూ ప్రమీల పశ్చాత్తాపంతో ఆయన కాళ్లమీద పడింది.

"ఊరుకోమ్మా...నీవల్ల జరగడమేమిటి? ఇదంతా మా ఖర్మ. ఇలా జరగాలని వుంది. అదే జరిగింది" అన్నారాయన.

"లేదు మామయ్యా...నేను మీపట్ల ఎంతో అమానుషంగా, అర్థంలేకుండా ప్రవర్తించాను. నా పాపానికి నిష్కృతిలేదు" అంటూ ఏడ్చింది.

"అన్నట్లు రవీంద్రా! మీ అమ్మకు నయం అయితే మమ్మల్ని ఇక్కడి నుండి సరాసరి ఏదైనా వృద్ధాశ్రమంలో చేర్పించు బాబు. అక్కడైనా ప్రశాంతంగా బ్రతుకుతాం" ఎంతో దీనంగా అడిగారాయన.

"ఏంటి మామయ్యా...మీరు వృద్ధాశ్రమానికి వెళ్తారా? అది నేను బ్రతికుండగా జరగనివ్వను. అంతేకాదు ఈ రోజునుండి నేను నా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను. నాకు నా తల్లిదండ్రులెంతో మీరూ అంతే. అందుచేత మీరు నన్ను క్షమించి మరలా మనం అందరం ఇక్కడినుంచి తిరిగి మన ఇంటికే వెళ్దాం. ఉన్న ఇంట్లోనే సర్దుకుందాం. ఉన్నదానితోనే హాయిగా కాలక్షేపం చేద్దాం. ఇంకెప్పుడూ నేనుగానీ, రవీంద్రగానీ మిమ్మల్ని ఏ విధంగానూ బాధపెట్టం" అంది ప్రమీల కన్నీళ్లతో.

అన్నపూర్ణకి స్పృహ వచ్చినట్లుగా కొంచెం మూలుగుతోంది. అక్కడే ఉన్న ప్రమీల ఆమె దగ్గరకు వెళ్లి "అత్తయ్యా కళ్ళు తెరవండి. నేనూ మీ అబ్బాయి వచ్చేసాము. ఇంక మిమ్మల్ని విడిచి వెళ్లం" అంది ప్రమీల.

అన్నపూర్ణ హాస్పిటల్‌లో వున్నంతకాలం ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటూ సమయానికి ఆవిడకు మందులిస్తూ ఆమె త్వరగా కోలుకునేలా చేసింది ప్రమీల.

అన్నపూర్ణ పూర్తిగా కోలుకున్న తరువాత అంతా తిరిగి ఇంటికి వచ్చేసారు. ఆనాటి నుండి ప్రమీల వాళ్లని ఎంతో ప్రేమగా చూస్తూ "నాకిప్పుడు ఒక్కరు కాదు, ముగ్గురు పిల్లలు" అనుకుంటూ ఆనందంగా అత్తమామలకు సేవలు చేస్తోంది.

మునుపటిలా రవీంద్ర, రాఘవరావులు పార్కుకి వెళుతున్నారు. మనవడు రాజేష్ ఒక్క క్షణం కూడా నాయనమ్మని వదలకుండా ఆమెతోనే ఉంటున్నాడు.

తన భార్యలో వచ్చిన మార్పుకి రవీంద్ర, కోడలిలో వచ్చిన పరివర్తనకి రాఘవరావు దంపతులు ఎంతో ఆనందించారు.

★★★

ప్రమీల తన అత్తమామల పట్ల ప్రవర్తిస్తున్న తీరు తెలుసుకున్న ఆమె అన్నయ్య, వదిన, తల్లిదండ్రులు కలసి ఆమెలో పరివర్తనను తీసుకుని రావడానికి ఆమె తమ ఇంటి గృహ ప్రవేశానికి వచ్చినప్పుడు అలా నాటకం ఆడారని అటు ప్రమీలకుగానీ, ఇటు రవీంద్రకు కానీ తెలియదు పాపం.

★★★

కొద్దిరోజుల తరువాత ప్రమీల ఇంటి గృహ ప్రవేశానికి వచ్చిన ఆమె తల్లిదండ్రులు, అన్నయ్య, వదినలు అత్తమామల పట్ల మారిన ఆమె వైఖరికి ఎంతగానో సంతోషించారు. తాము ఆడిన నాటకం ఫలించినందుకు ఎంతగానో ఆనందపడ్డారు.

★

## టీవీ పిచ్చిలో పిల్లలు

ఆమధ్య స్కాట్లండ్‌లో రెండువందలమంది పిల్లల్ని సైకాలజిస్టులు స్టడీ చేసారుట. 6-8 సంవత్సరాల మధ్యనున్న పిల్లలు టీవీలో వచ్చే ప్రోగ్రాములను చూడడానికే ఇష్టపడుతున్నారుట. ఒకేసారి కంప్యూటర్ని, టీవీని ఆన్ చేస్తే చాలామంది పిల్లల ముఖాలు టీవీలవైపే తిరిగిపోతున్నాయిట.

## మాట్లాడే గజరాజం

దక్షిణకొరియాలో యాంగిన్ నగర జంతు ప్రదర్శనశాలలో 16ఏళ్ళ కోసిక్ అనే ఏనుగు మాట్లాడగలదు. డిస్నీ క్యారెక్టర్‌లా పెద్ద పెద్ద వాక్యాలు మాట్లాడలేకపోయినా కొరియన్ భాషలో 'కూర్చో', 'అవును', 'కాదు', 'పడుకో' లాంటి చాలా మాటలు ఈ ఏనుగు మాట్లాడగలదు. తన తొండాన్ని గొంతులో దోపుకుని ఊపిరి పీల్చి విడుస్తూ మనుషుల్లా అర్థవంతమైన శబ్దాలు చేస్తుందిట. కోసిక్‌ని పదేళ్ళుగా సాకుతున్న మావటి ఆ ఏనుగు రెండేళ్ళుగా మాట్లాడ్డం వింటున్నాడట. మొదట్లో అతనాశ్చర్యపోయినా తనన్న మాటలనే అది రిపీట్ చేస్తుందని అతని కర్థమైంది. ఈ విషయం తెలిసి సైంటిస్టులు దాని మాటల ఫ్రీక్వెన్సీని మనుషులు మాట్లాడేటప్పటి ఫ్రీక్వెన్సీతో పోల్చిచూస్తే దాదాపు ఒకేలా ఉండడం కనిపించిందిట. ఈ విషయంలో మరింతగా పరిశోధన చేస్తామని శాస్త్రజ్ఞులు అంటున్నారు.

-తటవర్తి

